క్లుప్తంగా

లైన్‌మెన్‌పై కేసు

ఏలూరు టౌన్‌: విధి నిర్వహణలో అలసత్వం వహించిన సీనియర్‌ లైన్‌మెన్‌పై ఏలూరు త్రీటౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శాంతినగర్‌ డీ3 విద్యుత్‌ సెక్షన్‌లో సీనియర్‌ లైన్‌మెన్‌ కొత్తపల్లి రామకృష్ణ గత నెల 12న సత్రంపాడులోని ఎన్టీఆర్‌ సర్కిల్‌ సమీపంలో ఓ ఇంటికి విద్యుత్‌ సమస్య ఏర్పడటంతో అక్కడకెళ్లారు. జూనియర్‌ లైన్‌మెన్‌ వినోద్‌బాబును విద్యుత్‌ స్తంభం ఎక్కించి సరఫరా పునరుద్ధరణ పనులు చేపట్టారు. పనులు చేయిస్తుండగా ఒక్కసారిగా విద్యుత్‌ఘాతానికి గురై వినోద్‌బాబు కిందపడ్డాడు. ప్రాణాపాయం స్థితిలో ఉనన వినోద్‌బాబును ఏలూరులోని ఓ ప్రైవేటు హాస్పటల్‌లో చేర్పించి చికిత్స అందించారు. వినోద్‌బాబు భార్య నవ్యశ్రీ ఫిర్యాదు ఇచ్చిన మేరకు రామకృష్ణపై సీఐ వి.వెంకటేశ్వరరావు ఆదేశాలతో హెడ్‌కానిస్టేబుల్‌ ఏసేబు కేసు నమోదు చేశారు.

నవరత్నాలతో ప్రతి కుటుంబానికీ మేలు



ప్రచారంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్‌ ఘంటా పద్మశ్రీ, నాయకులు

దెందులూరు: డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖరరెడ్డి ఆశయాలకు అనుగుణంగా పేద,బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని జెడ్పీ చైర్‌పర్సన్‌ ఘంటా పద్మశ్రీ కోరారు. సోమవారం ఆమె పోతునూరులో బీసీ సంఘ నాయకుడు ఘంటా ప్రసాదరావు, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి, సర్పంచ్‌ బోదుల స్వరూప్‌, గ్రామ కమిటీ అధ్యక్షుడు సున్నా ఆశీర్వాదం, ఎంపీటీసీ సున్నా నరేష్‌, మాజీ సొసైటీ చైర్మన్‌ డీఎన్‌వీడీ ప్రసాద్‌ (బజ్జి)తో కలిసి నేను సిద్ధం- మా ఊరు సిద్ధం కార్యక్రమంలో నిర్వహించారు. వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలతోపాటు, నవరత్నాల పథకాల అమలు చేసి ప్రతి కుటుంబానికి మేలు చేశారని ఆమె అన్నారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి దేశమంతా రాష్ట్రం వైపు చూసేలా చేసిన ప్రణాళిక, గొప్ప విజన్‌ ఉన్న నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని దీవించాలని కోరారు. ఎమ్మెల్యేగా కొఠారు అబ్బయ్యచౌదరిని భారీ మెజారీతో గెలిపించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌ సీపీ పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని లబ్ధిదారులకు వివరించారు. రెండు ఓట్లను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌ కుమార్‌కు ఫ్యాన్‌ గుర్తుకు వేయాలని కోరారు.

ఘన స్వాగతం: పోతునూరులో నేను సిద్ధం- మా ఊరు సిద్ధం కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్‌ ఘంటా పద్మశ్రీకు అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. నాయకులు బీశెట్టి నూకరాజు, సున్నా ఆశీర్వాదం ఉన్నారు.

వలంటీర్లపై కోపం.. పింఛన్‌దారులకు శాపం

నాడు 'అవ్వాతాతలు.. వికలాంగులు... వితంతువులు పింఛన్‌ కావాలంటే రోజుల తరబడి, కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేది. జన్మభూమి కమిటీలు, టీడీపీ చోటామోటా నేతలను ప్రసన్నం చేసుకుంటేనే గానీ పింఛన్‌ అందే పరిస్థితి లేదు. కార్పొరేటర్ల ఇంటి దగ్గరో, ఇంకో చోటకో వెళ్లి ఎండలో సైతం క్యూలైన్‌లో సాయంత్రం వరకూ వేచిచూస్తే గానీ పెన్షన్‌ అందేది కాదు. వృద్ధులకు ఇచ్చే రూ.వెయ్యిలోనూ స్థానిక నేతలు, జన్మభూమి కమిటీలకు వాటాలు పోగా మిగిలిందే అవ్వాతాతల చేతిలో పెట్టి పంపే దైన్యస్థితి ఉండేది'

నేడు 'వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత గ్రామస్వరాజ్యానికి బాటలువేస్తూ ప్రభుత్వ పాలన ఇంటివద్దకే తీసుకొచ్చారు. వలంటీర్‌, సచివాలయ వ్యవస్థతో ప్రజాసేవలు గ్రామాలకే చేరాయి. ప్రతి నెలా 1న ఠంచన్‌గా.. పింఛన్‌ అవ్వాతాతల చేతికి చేరుతోంది. ఇప్పుడు నెలకు రూ.3 వేలు వృద్ధులకు అందిస్తున్నారు. తెల్లవారుజామునే అవ్వాతాత, వికలాంగులు లేచే సరికే తలుపుతట్టి మరీ.. పింఛన్‌ సొమ్ము చేతిలో పెడుతున్నారు. ఎవరికీ వాటాలు ఇవ్వాల్సిన పనిలేకుండా.. మొత్తం డబ్బులు లబ్ధిదారులకే చేరుతున్నాయి'

- కూటమి పార్టీలపై తీవ్ర అసంతృప్తి
- రాజకీయాలకు తమను బలిచేస్తున్నారంటూ ఆవేదన

ఏలూరు టౌన్‌ : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి వలంటీర్లను చూస్తే.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గుర్తుకు రావటంతో వలంటీర్లపై తీవ్ర అసహనం పెరిగిపోయింది. ఎలాగైనా వలంటీర్ల వ్యవస్థపై దెబ్బకొట్టాలనే లక్ష్యంతో చంద్రబాబు అనుకూల వర్గం కోర్టు తలుపుతట్టింది. సామాజిక పెన్షన్ల పంపిణీకి వలంటీర్లను వినియోగించకూడదంటూ కేసు వేయటంతో ఎన్నికల కమిషన్‌ వారిని పక్కనబెట్టింది. కానీ టీడీపీ కూటమి వలంటీర్లపై కోపంతో చేసిన కుట్రలతో ఇప్పుడు అవ్వాతాతలు, వికలాంగులు, వితంతువులు, డయాలసిస్‌ పేషెంట్లు.. ఇలా 13 వర్గాల పెన్షన్‌దారులకు శాపంలా మారింది.

పింఛన్‌ కష్టాలు

ఏలూరు నగరపాలక సంస్థ 79 సచివాలయాల పరిధిలో 2023 జనవరి నాటికి 30,514 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరికి ప్రతినెలా ప్రభుత్వం సుమారు రూ.8.95 కోట్లు పెన్షన్ల రూపంలో వలంటీర్ల ద్వారా పంపిణీ చేస్తోంది. అవ్వాతాతలు, వికలాంగులు, వితంతువులు ఇలా.. పెన్షన్‌దారులకు రూ.3 వేలు, సీకేడీయూ లబ్ధిదారులకు రూ.10 వేలు, డీఎంహెచ్‌ఓ కేటగిరిలో లబ్ధిదారులకు రూ.5 వేలు చొప్పున పింఛన్‌ అందజేస్తున్నారు. వీరంతా ఈ రెండు నెలలపాటు పెన్షన్‌ తీసుకునేందుకు కష్టాలు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. ఐదేళ్ల పాటు ఇంటివద్దనే ఉంటూ పెన్షన్‌ తీసుకోగా, తాజా ఉత్తర్వుల మేరకు సమీపంలోని సచివాలయాలకెళ్లి పింఛన్‌ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



ఏలూరులో జనవరిలో కొత్త పెన్షన్‌ అందిస్తున్న నాయకులు (ఫైల్‌)

టీడీపీ, జనసేనల వెన్నులో వణుకు

ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువ కావటం, నేరుగా ఇంటి ముంగిటకే అందించేలా వలంటీర్‌, సచివాలయ వ్యవస్థ ఏర్పాటు కావటం, ఐదేళ్లపాటు హాయిగా రూపాయి ఖర్చు లేకుండా సేవలు అందుకోవటంతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారు. ఇదే విషయంలో టీడీపీ, జనసేన పార్టీలకు భయం పట్టుకుంది. టీడీపీ హయాంలో చంద్రబాబు చేయలేని సంక్షేమాన్ని ప్రజలకు రుచిచూపించటం, వలంటీర్‌ అనే ప్రజాసేవకుని ద్వారా డైరెక్ట్‌గా లబ్ధి చేకూరటాన్ని ప్రతిపక్ష పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే తమ అడ్రస్‌ గల్లంతు కాకతప్పదనే భయంతో వారి వెన్నులో వణుకు పుట్టిస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పింఛన్‌	లబ్ధిదారులు
ఓఏపీ	13,975
వీవర్స్‌	769
వితంతువు	9,063
వికలాంగులు	3,725
గీతకార్మికులు	47
ఫిషర్‌మెన్‌	36
ట్రాన్స్‌జెండర్స్‌	31
చర్మకారులు	198
ఒంటరి మహిళలు	1,428
డప్పు కళాకారులు	68
సీకేడీయూ	69
డీఎంఅండ్‌హెచ్‌ఓ	169
అభయహస్తం	86

వైఎస్సార్‌ సీపీని ఎదుర్కోలేకే..



రాజకీయంగా వైఎస్సార్‌ సీపీని ఎదుర్కొలేక ప్రతిపక్ష పార్టీలన్నీ వలంటీర్‌ వ్యవస్థపై బురదజల్లేందుకు కుట్రలు చేస్తున్నాయి. ప్రజలకు నేరుగా ప్రభుత్వ పథకాలను ఇంటికే వచ్చి అందిస్తుంటే తట్టుకోలేక, అవ్వాతాతలను ఇబ్బందులకు గురిచేసేలా కోర్టులకెళ్లి పింఛన్లు పంపిణీ చేయకుండా అడ్డుకుంటున్నారు. ఇలాంటి నీచ రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారు, రాబోయే ఎన్నికల్లో వారికి గుణపాఠం చెబుతారు.
– యల్లాపు మోజెస్‌, సేవాదళ్‌ ఏలూరు నగర అధ్యక్షులు

వలంటీర్లంటే ఆ పార్టీలకు వణుకు



ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన అనంతరం ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటివద్దకే తీసుకొచ్చేందుకు వలంటీర్‌, సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అవ్వాతాతలకు, వికలాంగులకు పింఛన్లు పంపిణీ చేయటంతోపాటు, ప్రజలకు సంక్షేమ పథకాలను మంజూరు చేయించటంలో కీలకపాత్ర పోషించారు. టీడీపీ, జనసేన పార్టీలు వలంటీర్లను చూస్తే భయంతో వణుకుతున్నాయి.
– నాని జయరాజ్‌, ఏలూరు వన్‌టౌన్‌

కలెక్టరేట్‌లో క్యాంటీన్‌ ప్రారంభం



కలెక్టరేట్‌లో క్యాంటీన్‌ను ప్రారంభించిన కలెక్టర్‌ ప్రసన్న వెంకటేష్‌

ఏలూరు(మెట్రో): ఎన్నికల నిర్వహణలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది సౌకర్యార్థం కలెక్టరేట్లో క్యాంటిన్‌ను ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్‌ వె.ప్రసన్న వెంకటేష్‌ తెలిపారు. సోమవారం కలెక్టరేట్లో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్యాంటీన్‌ను కలెక్టర్‌ ప్రారంభించి మాట్లాడారు. ఆహార పదార్థాల నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్‌ కలెక్టర్‌ బి.లావణ్య వేణి, డీఆర్‌ఓ డి.పుష్పమణి, జెడ్పీ సీఈఓ కె.సుబ్బారావు, డీపీఓ శ్రీనివాస్‌ విశ్వనాథ్‌, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, డ్వామా పీడీ రాము, ఆర్డీఓ ఎన్‌ఎస్‌కే ఖాజావలి, డీఎస్‌ఓ ఆర్‌ఎస్‌ఎస్‌ రాజు తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి చలపతిరావు



చలపతిరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్‌): ఏలూరు నగర పాలక సంస్థ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారంలో తనదైన వరవడిలో కృషి చేసిన మహోన్నత వ్యక్తి వల్లూరి వెంకట చలపతిరావు అని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, ది జోనల్‌ మున్సిపల్‌ ఎంప్లాయీస్‌ యూనియన్‌ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు అన్నారు. స్థానిక కోటదిబ్బ ఎస్‌ఆర్‌వన్‌ విశ్రాంతి ఉద్యోగుల కార్యాలయం వద్ద ది జోనల్‌ మున్సిపల్‌ ఎంప్లాయీస్‌ యూనియన్‌ ఆధ్వర్యంలో చలపతిరావు 22వ వర్ధంతి కార్యక్రమం యూనియన్‌ అధ్యక్షుడు బల్ల నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. చలపతిరావు చిత్రపటానికి నివాళులర్పించారు. చలపతిరావు ఆశయాల స్ఫూర్తిగా నగర ప్రజలకు సేవలు అందించాలని నాయకులు సూచించారు. వాటర్‌ సఫ్లై వాటర్‌ వర్క్స్‌ ఉద్యోగ సిబ్బంది ఆ దిశగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్‌ నాయకులు డి.వెంకటేశ్వరరావు, ఎస్‌ శ్రీనివాసు, ఎస్‌ఎంవీ సుబ్బారావు, కేవీ రమణ, మధ్యాహ్నపు దుర్గారావు, ఆసిర్‌ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను రెండోసారి సీఎం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ముంగర సంజీవ్‌కుమార్‌

ఏలూరు రూరల్‌ : సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపిన వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేయాలని ఏలూరు రూరల్‌ మండలాధ్యక్షుడు పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. సోమవారం పాలగూడెంలో సర్పంచ్‌ పత్యాల సునీత అధ్యక్షతన వైఎస్సార్‌ సీపీ గ్రామ కార్యకర్తలు, అభిమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. పార్టీ ఐదేళ్ల పాలనలో గతంలో ఎన్నడూలేని సంక్షేమ, అభివృద్ధి జరిగిందన్నారు. అందుకే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందితినే ఓటు వేయాలని ప్రజలను ధైర్యంగా కోరుతున్నారని వివరించారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లోనూ అభివృద్ధి చేశారని కొనియాడారు. ఎన్నికల్లో ప్రజలు మరోసారి వైఎస్సార్‌ సీపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వడ్డి కార్పొరేషన్‌ చైర్మన్‌ ముంగర సంజీవ్‌కుమార్‌ మాట్లాడుతూ కులం, మతం, వర్గ బేధం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు తేరా ఆనంద్‌ మాట్లాడుతూ విద్యావంతుడైన ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కోట్ల రూపాయలు ఖర్చుచేసి గ్రామంలో సచివాలయం, కమ్యునిటీహాలు, డ్రెయినేజీ, రోడ్లు నిర్మించారని చెప్పారు. ఎంపీటీసీ బొమ్మ వరపు మాణెమ్మ, ఉపసర్పంచ్‌ తూతా నిరంజన్‌, పార్టీ పాలగూడెం అధ్యక్షుడు బత్తుల అప్పారావు తదితరులు ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌ సీపీ అధిక మెజార్టీతో విజయం సాధిస్తుందని చెప్పారు. సమావేశంలో మాదేపల్లి సర్పంచ్‌ కూరపాటి ప్రభుదేవ తదితరులు పాల్గొన్నారు.

భీమ నాగలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

దెందులూరు: గాలాయగూడెంలో అచ్చమ్మపేరంటాలమ్మ తల్లి ఆలయ ఆవరణలోని భీమ నాగలింగేశ్వరస్వామి 6వ వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. తొలుత స్వామికి వివిధ పుష్పాలతో విశిష్ట అలంకరణ, పూజలు చేశారు. అనంతరం గ్రామోత్సవం, కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

216 మందికి చీరల పంపిణీ

దెందులూరు: మండలంలో 216 మంది ముత్తైదువులకు మండల రామదండు కమిటీ ఒకే రంగు కలిగిన చీరలను పంపిణీ చేశారు. ఉగాది రోజున గంగానమ్మ అమ్మవారికి 216 మంది మహిళలతో కలాశాభిషేకం చేసేందుకు రామదండు కమిటీ నిర్ణయించి 216 మందికి చీరలు పంపిణీ చేశారు.

మూల్యాంకనకు వసతుల కల్పన భేష్‌



మూల్యాంకన అధికారులను కలిసి అభినందిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనానికి స్థానిక సెయింట్‌ గ్జేవియర్‌ పాఠశాలలో కల్పించిన వసుతులు ప్రశంసనీయమని, ఇందుకు శ్రద్ధకనబరిచిన రాష్ట్ర పరిశీలకులు ఆర్‌ నరసింహారావు, డీఈఓ ఎస్‌ అబ్రహాంలను పీఆర్‌టీయూ సంఘనాయకులు ప్రత్యేకంగా అభినందించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి మూల్యాంకన విధుల నుంచి తగిన మినహాయింపులు కలిగించి మానవత్వం చాటున్నారని కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ నాయకులు అధికారులతో మాట్లాడుతూ ఎండ తీవ్రత దృష్ట్యా మూల్యాంకనం నిర్వహించే తరగతి గదుల్లో ఫ్యాన్ల సౌకర్యం మరింతగా పెంచాలని, గత ఏడాది మూల్యాంకన విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు టీఏ, డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. దీనిపై స్పందించిన డీఈఓ గత ఏడాది బకాయిలను త్వరలోనే విడుదల చేయడానికి రాష్ట్ర ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. అధికారులను కలిసిన వారిలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పువ్వుల ఆంజనేయులు, కేవీవీ సుబ్బారావు, రాష్ట్ర, జిల్లా బాధ్యులు కోడూరి శ్రీనివాసరావు, అప్పిరెడ్డి రాము, డి.రాజాబాబు, జి.కృష్ణమూర్తి ఉన్నారు.

టీడీపీకి చేదు అనుభవం

వలసవాదులకు పెద్దపీటపై అలకలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మూడు పార్టీల కూటమికి ఏలూరు నియోజకవర్గంలో ఆదిలోనే ఆగ్రహావేశాలు స్వాగతం పలికాయి. టీడీపీ ఇప్పటి వరకూ ప్రజాచైతన్య యాత్ర చేసి ప్రస్తుతం ఎన్నికల సమీపిస్తున్న వేళ తొలిసారిగా ప్రజాగళం సభ స్థానిక 50వ డివిజన్‌లో ఏర్పాటు చేసింది. ఈ సభ టీడీపీ సీనియర్లను ఆ పార్టీకి దూరం చేసే దిశగా తొలి అడుగువేసింది. గత ఐదేళ్లుగా ప్రతిపక్షంలో కూర్చోవాల్సివచ్చిన కారణంగా ఈ దఫా అయినా పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కంకణం కట్టుకున్న ఆ పార్టీ సీనియర్‌ నాయకులకు ప్రజాగళం తొలి సభ చేదు అనుభవాన్ని మిగిల్చింది. సోమవారం సాయంత్రం 50వ డివిజన్‌లో టీడీపీ నాయకుడు బొరోతు బాలాజీ అధ్యక్షతన ప్రజాగళం సభ ఏర్పాటు చేశారు. ఈ సభా వేదికపైకి టీడీపీ సీనియర్‌ నాయకులు, గత ఐదేళ్ళుగా పార్టీని తమ భుజస్కందాలపై మోస్తున్న మాజీ కార్పొరేటర్లను పిలుస్తామని తొలుత టీడీపీ నియోజకవర్గ నాయకులు ప్రకటించారు. తీరా సభకు వెళ్లిన ఆ సీనియర్లను పక్కనపెట్టి ఇటీవల వైఎస్సార్‌ సీపీ నుంచి టీడీపీలోకి మారిన కార్పొరేటర్లను వేదికపైకి పిలవడంతో షాక్‌కు గురయ్యారు. ఇప్పటి వరకు పార్టీని మోస్తున్న తమను కాదని, వలసవాదులకు పెద్దపీటవేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేసి సభ నుంచి వెళ్లిపోయారు. ఇప్పటి వరకు ప్రశాంతంగా ఉందనుకున్న టీడీపీలోకి రౌడీషీటర్లను చేర్చుకోవడమే పెద్ద తప్పుగా పరిగణిస్తుండగా వారికే ప్రాధాన్యత ఇవ్వడాన్ని టీడీపీ సీనియర్లు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇదే విధానం కొనసాగితే నియోజకవర్గంలో పార్టీని బతికించుకోవడం కష్టమని, వచ్చే ఎన్నికల్లో విజయం సాధించడం దుర్లభమని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికంతటికీ టీడీపీ అభ్యర్థి బడేటి చంటికి రాజకీయ వ్యూహకర్తగా వ్యవహరించే ఒక వ్యక్తే ప్రధాన కారణమని, అతనిని దూరం పెడితే గానీ తాము పార్టీకి పని చేయలేమని పార్టీ రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదు చేయడానికి సదరు సీనియర్లు సిద్ధపడుడుతున్నట్లు సమాచారం.

వలంటీర్ల సేవలను ప్రజలకు దూరం చేసిన చంద్రబాబు

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: అవ్వాతాతలను, దివ్యాంగులను, అంధులను ఇబ్బందిపెడుతున్న చంద్రబాబు పార్టీ శ్రేణులకు పుట్టగతులుండవని వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు సంతోషంగా ఉంటే చూడలేని చంద్రబాబు నైజం మరోసారి బయటపడిందన్నారు. వాళ్లే ఫిర్యాదు చేసి అవంతరాలు సృష్టించి జగనన్నపై నిందలు వేస్తున్నారని విమర్శించారు. 40 రోజుల్లో టీడీపీ కుతంత్రాలు అంతమవుతాయని, జగనన్న నాయకత్వంలో ప్రజలకు అందుతున్న సుపరిపాలన, సంక్షేమం, అభివృద్ధిని తట్టుకోలేక టీడీపీ నీచ రాజకీయాలకు దిగజారుతోందన్నారు. ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేసి వలంటీర్ల సేవలను ప్రజలకు దూరం చేశారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. లబ్ధిదారులకు పెన్షన్‌ అందకుండా అడ్డంకులు కల్పిస్తున్న చంద్రబాబుకు వారి ఉసురు తగులుతుందని అన్నారు. 40 రోజుల్లో వైఎస్సార్‌ సీపీ మళ్లీ అధికారంలోకి వచ్చి రాష్ట్ర ప్రజలకు మంచి రోజులు వస్తాయని ఎమ్మెల్యే అన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	26	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	56
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	05,07,10
బెండకాయలు	20	కంద	76
పచ్చిమిర్చి	38	బీట్‌రూట్‌	38
కాకర కాయలు	30-36	కీరా దోస	36
బీరకాయలు	24	ఫ్రెంచ్‌బీన్స్‌	90
బీరకాయలు (పందిరి)	44	అల్లం	176
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్‌	34-44	పాలకూర	10
దొండకాయలు	20	చుక్కకూర	10
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	26	గోంగూర	08
గోరుచిక్కుడు	30	పుదీనా	05
దోసకాయలు	20	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్‌	74
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్‌ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	40
ఏలూరు - బీహెచ్‌ఈఎల్‌ (అమరావతి)	22.00	42
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	14

సూపర్‌ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్‌ నంబర్‌	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌	21.45	4820	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌ వయా రామచంద్రపురం	19.45	4798	17
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌ వయా ఖమ్మం	21.00	4804	25
ఏలూరు -ఈసీఐఎల్‌	22.30	4814	26
ఏలూరు -తిరుపతి	16.00	4830	29

వ్యసనాలకు బానిసై.. నేరస్తుడిగా మారి

వైద్యుడు భానుసుందర్‌ అరెస్ట్‌




మాట్లాడుతున్న సీఐ రాజశేఖర్‌, ఎస్సై లక్ష్మణ్‌బాబు, డాక్టర్‌ బానుసుందర్‌ (నిందితుడు)

ఏలూరు టౌన్‌: వ్యసనాలకు బానిసగా మారి చేసిన అప్పులను ఎగనామం పెట్టేందుకు అప్పు ఇచ్చిన వారికి మార్ఫిన్‌ ఇంజెక్షన్‌ ఇస్తూ వారిని ఆసుపత్రి పాలుచేసి ఇంట్లోని సొత్తును చోరీ చేస్తోన్న ప్రబుద్ధుడిని ఏలూరు వన్‌టౌన్‌ పోలీసులు అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ మేరకు ఏలూరు వన్‌టౌన్‌ స్టేషన్‌లో వన్‌టౌన్‌ సీఐ ఎస్‌ రాజశేఖర్‌ సోమవారం రాత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఏలూరు చొదిమెళ్లకు చెందిన కొవ్వూరి భానుసుందర్‌ ప్రస్తుతం విద్యానగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇతను పిలిపిన్స్‌లో ఎంబీబీఎస్‌ చదివాడు (ఎంసీఐ) పరీక్ష రాయలేదు. అయితే ఆన్‌లైన్‌లో క్రికెట్‌ బెట్టింగ్‌ వ్యసనంగా మారడంతో భారీగా అప్పులు చేస్తూ పారీ మ్యాచ్‌ యాప్‌లో క్రికెట్‌ బెట్టింగ్‌ ఆడుతూ అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చాలంటూ ఒత్తిడి చేయడంతో వారి ఇంటికెళ్లి మార్ఫిన్‌ ఇంజెక్షన్‌ ఇస్తూ స్పృహ కోల్పోయిన అనంతరం తానే ఆసుపత్రిలో చేర్పిస్తూ ఆసుపత్రి ఖర్చుల పేరుతో కుటుంబ సభ్యుల నుంచి డబ్బులు వసూలు చేసి, వాటిని అప్పుగా చెల్లిస్తున్నాడు. ఇదే తరహాలోనే పక్కా పథకంలో చొదిమెళ్లకు చెందిన తంబి అలియాస్‌ మల్లేశ్వరరావుకు మార్ఫిన్‌ ఇంజెక్షన్‌ ఇచ్చి స్పృహ కోల్పోయాక బీరువాలోని బంగారు ఆభరణాలు, రూ.1.50 లక్షలు అపహరించాడు. ఈ ఇంజెక్షన్‌ కారణంగా మల్లేశ్వరరావు మృతి చెందాడు. అనంతరం ఏలూరు తూర్పువీధికి చెందిన హిమతేజ, సత్రంపాడుకు చెందిన రాయల వెంకట్‌ అనే ఇద్దరు వ్యక్తులకు సైతం ఇదే తరహాలో మార్ఫిన ఇంజెక్షన్‌ చేయగా వారు హాస్పటల్‌ పాలయ్యారు. కుటుంబ సభ్యులు నిందితుడు భానుసుందర్‌ను అనుమానించడంతో పరారయ్యాడు. దీంతో బాధితులు ఏలూరు వన్‌టౌన్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిని మార్చి 31న పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. నిందితుడి నుంచి వాడిన డ్రగ్‌ బాటిల్‌, దూది, బంగారు ఆభరణాలు రికవరీ చేశారు. కేసు దర్యాప్తులో ఏలూరు వన్‌టౌన్‌ సీఐ ఎస్‌ రాజశేఖర్‌, ఎస్సై ఎస్‌ లక్ష్మణ్‌బాబు, హెచ్‌సీ ఏ.అప్పన్న, పీసీలు సీహెచ్‌ లక్ష్మీనారాయణ, కె.శ్రీనివాస్‌ను జిల్లా ఎస్పీ మేరి ప్రశాంతి అభినందించారు.

వనితను గెలిపించుకుందాం

ద్వారకాతిరుమల: గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యేగా మన ఆడపడుచు, రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనితమ్మను గెలిపించుకుని, వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేసుకుందామని ఆమె సోదరుడు జొన్నకూటి విజయ్‌కుమార్‌ పిలుపునిచ్చారు. మండలంలోని ఐఎస్‌ జగన్నాధపురంలో విజయ్‌కుమార్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు ఆశీర్వాదం, వెల్సన్‌ సోమవారం గడపగడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌ సీపీ నేతలతో కలసి ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఇదే ప్రభుత్వానికి పట్టం కట్టాలని కోరారు.